బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట, కలెక్టరేట్, జూన్ 29: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ కోరారు. సిద్దిపేట కమిషనరేట్‌లో శనివారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూలై ఒకటి నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. బాలకార్మికులను చూసినప్పుడు 1098 లేదా 100కి డయల్ చేయాలన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 8712667100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్- ఎక్స్‌వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. డీడబ్ల్యూవో శారద, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గా, బాలరక్ష భవన్ కో ఆర్డినేటర్ మమత పాల్గొన్నారు.

శిక్ష పడేలా చూడాలి

కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చూడాలని సీపీ అనురాధ సూచించారు. కోర్టు విధులు నిర్వహించే సిబ్బందితో సిద్దిపేట కమిషనరేట్‌లో ఆమె సమీక్ష నిర్వహించారు. ఏఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వండి

హుస్నాబాద్‌టౌన్: తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 29: ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేరుచేసి ఇస్తేనే మున్సిపల్ వాహన సిబ్బంది తీసుకుంటారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని మున్సిపల్‌వైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 7వ వార్డులో బేసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండ్ల నుంచి తెచ్చిన చెత్తడబ్బాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి ఎలా వాహన సిబ్బందికి ఇవ్వాలనే విషయంపై చైర్‌పర్సన్ వివరించారు. చెత్తను ఇంటిపక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో ఎట్టిపరిస్థితుల్లో వేయరాదని, చెత్తను అలావేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ చిత్తారి పద్మ, కోఆప్షన్ సభ్యురాలు శ్రీలత, హరితహారం సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారులు సృజన్, సాంబరాజు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆర్పీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం ఇవ్వడం సిగ్గుమాలిన చర్య

చేర్యాల, జూన్ 29 : ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడం సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు పక్క జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి గర్ల్స్ హాస్టల్ కోసం ఇవ్వడం అంటే రాజకీయాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. జూనియర్ కళాశాల బృందం అడ్మిషన్లు చేపించలేదని, దాని కారణంగా అడ్మిషన్స్ రాలేదని హాస్టల్ ప్రారంభం కాలేదన్నారు. అడ్మిషన్లు, రిజల్ట్‌పై శ్రద్ధపెట్టని అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ ఇప్పుడు కాంగ్రెస్ నాయకుడి వద్దకు వెళ్లి హాస్టల్ కావాలని అడగడం సబబు కాదన్నారు.కొమ్మూరిని కలిసిన కళాశాలకు చెందిన ఉద్యోగులపై ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు తాడూరి భరత్‌కుమార్, రాకేశ్, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు ఎక్కువగా పెంచాలి

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్ షఫీఉల్లా

గజ్వేల్, జూన్ 29: గ్రామాల్లో పండ్ల మొక్కలు అధికంగా పెంచేలా ప్రణాళిక రూపొందించాలని, రోడ్ల వెంబడి ఏపుగా పెరిగే మొక్కలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కమిషనర్ షఫీఉల్లా అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని దిలాల్‌పూర్‌లోని పల్లెప్రకృతి వనం, నర్సరీలను ఆయన సందర్శించి అందులోని మొక్కల వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పల్లెప్రకృతి వనం పచ్చదనంలో పెద్దగా పెరిగిన మొక్కలతో కనిపించడంతో పాటు నర్సరీ రిజిస్టర్ల నిర్వాహణ బాగా ఉండడంతో సంతృప్తి చెందారు. గ్రామాల్లోని కమ్యూనిటీ హాళ్లు, పాఠశాల ఆవరణ, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీవో దేవకీదేవి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో దయాకర్, ఏపీఎం సురేందర్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, వెంకట్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

రైతు భరోసా అమలుపై సమావేశం

సమావేశంలో పాల్గొన్న అధికారులు

వర్గల్, జూన్ 29: ప్రభుత్వం వానకాలం పంటసాగు కింద అందజేయనున్న రైతు భరోసా అమలుపై శనివారం వర్గల్ మండల సహకార సంఘం సొసైటీ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన వ్యవసాయశాఖ ఏవో శేషశయన, సహకార సంఘం సీఈవో జితేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. రైతులకు ఆర్థికంగా చేయూత ఇచ్చే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, ఏఈవోలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

అల్వాలలో అసంపూర్తిగా ఉన్న భవనాల చిత్రపటాలను చూపుతున్న నాయకులు

మిరుదొడ్డి, జూన్ 29 : సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, పార్టీ మండల సీనియర్ నాయకుడు సూకురి లింగం అన్నారు. జనవరిలో రాష్ట్ర మంత్రి కొండాసురేఖ అల్వాలలో నూతన గ్రామపంచాయతీ భవనం, ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ల పనులు ప్రారంభించినా నేటికీ భవనాల పనులు పూర్తి కాలేదు. దీంతో శనివారం భవనాల చిత్ర పటాలను బీఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశంలో చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటాలు చేయడం తప్పా..? రాష్ట్ర ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. అల్వాలలోని అసంపూర్తి భవనాలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ,అహ్మద్, మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య పాల్గొన్నారు.

బేకరీలో కుళ్లిన కేక్‌లు

గజ్వేల్, జూన్ 29: అధికారుల తనిఖీల్లో కుళ్లిన కేక్‌లు, కాలం ముగిసిన కూల్‌డ్రింక్‌లు లభ్యంకావడంతో వాటిని స్వాధీనం చేసుకుని జరిమాన విధించిన ఘటన మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో శనివారం జరిగింది. ప్రజ్ఞాపూర్‌లోని బెంగళూర్ అయ్యంగార్ బేకరీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా కుళ్లిన కేక్ లు, కాలం చెల్లిన కూల్‌డ్రింక్‌లు లభ్యమయ్యాయి. దీంతో రూ.10వేల జరిమాన విధించి వాటిని చెత్తబండిలో తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, బేకరీల్లో పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి

ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, జూన్ 29: అర్హులైన వారికి అధికారులు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఏవోకు శనివారం వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరెట్ ఎదుట ఆందోళన చేశారు. లబ్ధిదారుల విషయంలో సమగ్ర విచారణ చేపట్టి జాబితా నుంచి అనర్హులను తొలిగించి అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, పద్మ, కవిత, లక్ష్మి, నర్సింహులు, వెంకటేశ్, మహేందర్, సంపత్, రాము, సొక్కయ్య, నరహరి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ'ఏ'లోకి మార్చాలి

సిద్దిపేట టౌన్,జూన్ 29 : సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీడీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మారుస్తామని ఇచ్చిన హామీని స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే నెరవేర్చాలని ఆ సంఘం హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగటి శ్రీనివాస్ కోరారు. సిద్దిపేటలో శనివారం ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ చేపట్టలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం జూన్ మొదటి వారంలోనే ప్రారంభించి ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చేప పిల్లల పంపిణీ, రిజర్వేషన్ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లింగం, సుధాకర్, రాజు,తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

గజ్వేల్, జూన్ 29: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన గజ్వేల్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన టంగుటూరి శివానంద్ పిడిచేడ్ మార్గంలో గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకొని విచారించగా మరో ఇద్దరి నిందితుల పేర్లు చెప్పాడు. దీంతో వర్గల్ మండలం గౌరారం బస్టాండ్ వద్ద హైదరాబాద్‌కు చెందిన కుల్దీప్‌సింగ్, అనితబాయ్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో వారి వద్ద 330 గ్రాముల గంజాయి లభ్యం కావడంతో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చర్యలు

ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాల ప్యాకెట్లు, రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

దుబ్బాక, జూన్29: నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని దుబ్బాక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ సూచించారు. శనివారం దుబ్బాక పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. విత్తనాలకు సంబంధించిన రసీదు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్‌పై తయారు తేదీ, కంపెనీ లాట్ నెంబర్, ధరను చూడాలని సూచించారు.అనంతరం దుబ్బాక పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సందీప్, ఆర్ఐ నరేందర్, ఏఈవోలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట జీలుగుతో అధిక దిగుబడులు

చిన్నకోడూరు, జూన్ 29: పచ్చిరొట్ట జీలుగు సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ పద్మ అన్నారు. చిన్నకోడూరు మండలంలోని అల్లీపూర్,మైలారం,కిష్టాపూర్ గ్రామాల్లో శనివారం పచ్చిరొట్ట ఎరువు క్షేత్రం, పొలంలో వేసిన జీలుగు, ఆయిల్‌పామ్ తోటలు, అంతర్ పంట పత్తి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీలుగు సాగు చేయడం వల్ల నేలలు సారవంతమై అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయంతికుమార్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి గౌతమి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరానికి రైతుబంధు ఇవ్వాలి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బట్టు అంజిరెడ్డి

ములుగు, జూన్ 29 : రైతులు సాగు చేసే ప్రతి ఎకరానికి 'రైతు భరోసా' ద్వారా పెట్టుబడి సాయాన్ని అందించాలని పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. ములుగులో శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ అధ్యక్ష తన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ... రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పెట్టుబడి సాయాన్ని అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పెట్టుబడి సాయాన్ని పెంచి యథావిధిగా రైతుబంధును రైతులకు వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతుల అభిప్రాయాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు భరోసా అమలుకు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ప్రగతి, పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. రైతులు సాగు చేసే ప్రతి ఎకరానికి పెట్టుబడి సాయాన్ని అందించాలని కొందరు, 10 ఎకరాలకు మాత్రమే పరిమితి విధించి నిజమైన రైతులకే రైతు భరోసా అందించాలని మరికొందరు రైతులు అభిప్రాయలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు రమేశ్, భంగ్య, యాదయ్య, రాములుగౌడ్, కళమ్మ, అనంతరెడ్డి, వెంకటేశం, సత్తయ్య ఏఈవో పృథ్వీ, పీఏసీఎస్ సిబ్బంది స్వరూప, అశోక్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

సిద్దిపేట అర్బన్: గజమాలతో పవన్‌కళ్యాణ్‌ను సత్కరిస్తున్న అభిమానులు, జనసేన నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 29 : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొండగట్టు ఆలయానికి వెళ్తున్న సందర్భంగా శనివారం మండలంలోని పొన్నాల గ్రామ శివారులో పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ కారు బయటకు వచ్చి వారికి అభివాదం చేశారు. పవన్ కళ్యాణ్‌ను ఆయన అభిమానులు, జనసేన నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం కొండగట్టుకు ఆయన బయల్దేరారు.

వంటిమామిడి వద్ద ....

ములుగు, జూన్ 29 : ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు ఆయన అభిమానులు, బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్తున్న పవన్‌కళ్యాణ్‌కు మండలంలోని వంటిమామిడి వద్ద రాజీవ్‌రహదారిపై ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ అభిమానులకు అభివాదం చేస్తూ కొండగట్టుకు బయలుదేరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

లద్నూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ పుట్ల శ్రీనివాస్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్29: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని లద్నూర్ పీహెచ్‌సీని ఆయన సందర్శించి దవాఖానలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వివిధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వందశాతం వ్యాధులు మనం తాగే నీటి వల్లనే వస్తాయని, ప్రజలు రక్షిత తాగునీటిని మాత్రమే తాగాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లద్నూర్ పీహెచ్‌సీలోని వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్, లద్నూర్ వైద్యాధికారి డాక్టర్ సుధీర్‌రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిధులున్నా పనుల్లో జాప్యం

బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ బాలేశంగౌడ్

జగదేవ్‌పూర్, జూన్ 29 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు నిధులు కేటాయించినప్పటికీ పనుల్లో జాప్యం చేస్తున్నారని ఎంపీపీ బాలేశంగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనా పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అంతకుముందు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయకక్షతోనే నిరాధార ఆరోపణలు

జగదేవ్‌పూర్, జూన్ 29: మండలంలోని అంతాయగూడెం గ్రామానికి చెందిన రైతులు, సూరకొండయ్య నర్సయ కుటుంబ సభ్యులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మాజీ సర్పంచ్ తీగుళ్ల సత్యం, నాయకుడు లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ భూమిని అక్రమంగా పట్టా చేయించుకుంటున్నారని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఏండ్ల తరబడి కబ్జాలో ఉన్నప్పటికీ గ్రామంలోని కొన్ని సర్వేనంబర్ల లోని భూములకు పట్టాలు రాలేదని, ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామంలో ఇంకా 100 ఎకరాలకు పైగా భూమి పట్టాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని కోర్టు ఆర్డర్ ద్వారా అన్ని రకాల పత్రాలతో కలెక్టర్ ఆదేశాల ద్వారా పట్టా చేయించుకుంటున్నట్లు తెలిపారు.

నిషేధిత గుట్కా, సిగరెట్ ప్యాకెట్లు పట్టివేత

హుస్నాబాద్, జూన్ 29: ప్రభుత్వం నిషేధించిన గుట్కా, సిగరెట్ ప్యాకెట్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌తో పాటు స్థానిక పోలీసులు శనివారం హుస్నాబాద్‌లో పట్టుకున్నారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని హనుమాన్ హోల్‌సేట్ కిరాణాషాపులో యజమాని రాథోర్ నకుల్‌సింగ్ నిషేధిత గుట్కాలు, సిగరెట్లు నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీటి విలువ రూ.25,624 ఉంటుందని, నకుల్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

అవినీతిపై విచారణ జరపాలి

హుస్నాబాద్, జూన్ 29: పట్టణంలో బాల వికాస, స్థానిక మున్సిపల్ సంయుక్తంగా నెలకొల్పిన వాటర్ ప్లాంట్లను అక్రమంగా మూసివేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందకుండా చేశారని, వీటిల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మూడు ప్లాంట్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పట్టణ ప్రజలకు నీళ్లందించిన 3 వాటర్ ప్లాంట్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో మూతపడ్డాయని, ఇందుకు ఆయా ప్లాంట్ల కమిటీలే కారణమన్నారు. ఆయన వెంట బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, బీజేపీ నాయకులు రామ్‌ప్రసాద్, అనంతస్వామి ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన

జగదేవ్‌పూర్, జూన్29: మండలంలోని అలిరాజుపేటలో శనివారం ఏవో వసంతరావు సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం హాస్, ఉజ్వలత్రి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఆంటోని, కోఆర్డినేటర్ దివ్య, ఏఈవో శరణ్య తదితరులు పాల్గొన్నారు.

బుక్‌స్టాల్స్‌పై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట కమాన్, జూన్ 29 : విద్యార్థుల తల్లిదండ్రులకు పెనుభారంగా అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న బుక్‌స్టాల్స్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ సిద్దిపేట మాజీ అధ్యక్షుడు పెర్కబాబు, నాయకులు సతీశ్, మెరుగు మాధవ్ కోరారు. శనివారం వారు సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలలు స్థానికంగా ఉన్న బుక్‌స్టాల్స్ యజమానులతో కుమ్మక్కై ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని మండిపడ్డారు. నర్సరీ పాఠ్య పుస్తకాలకు రూ.4,500, ఒకటో తరగతి విద్యార్థుల పాఠ్యపుస్తకాలకు రూ.5,500 విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులకు తోడు పాఠ్యపుస్తకాల ధరలు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా చట్టాలను తుంగలో తొక్కుతూ మరికొన్ని విద్యాసంస్థలు పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలను విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే ప్రైవేట్ పాఠశాలలు, బుక్‌స్టాల్స్‌ను సందర్శించి వాటిపైన తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ డిక్షనరీలు అందజేత

విద్యార్థులకు ఇంగ్లిష్ డిక్షనరీలు అందజేస్తున్న తలకొక్కుల చంద్రకళ ట్రస్ట్ సభ్యులు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 29 : కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం గజ్వేల్‌కు చెందిన తలకొక్కుల చంద్రకళ ట్రస్ట్ సభ్యులు 100 ఇంగ్లిష్ డిక్షనరీలు అందజేశారు.కార్యక్రమంలో తలకొక్కుల చంద్రకళ ట్రస్ట్ సభ్యులు, పీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్29: అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ ఎంపీటీసీ ఇస్లావత్ నముక్ శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ కొండాపూర్ ఎంపీటీసీ పరిధిలోని కొండాపూర్, కూటిగల్, దుబ్బతండా, హనుమతండా, రెడ్యానాయక్‌తండాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఎంపీటీసీ వెంట నాయకులు రాజేశ్‌రాథోడ్, కీమానాయక్, చిరంజీవి ఉన్నారు.

విస్తృతంగా తనిఖీలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్29: మద్దూరు మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులతో పాటు వివిధ ప్రదేశాల్లో నార్కోటిక్ డాగ్స్‌తో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్సై జిల్లా జగదీశ్వర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల కోసం ఎంపికలు

సిద్దిపేట, జూన్ 29: జిల్లాస్థాయి క్రీడా పాఠశాల కోసం ఎంపిక పోటీలు శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించినట్లు జిల్లా యువజన, క్